# గోదారమ్మ-5

'నువ్వేం మాష్టారివి కావు మార్కులేయటానికి... మాష్టారి కూతురివి మాత్రమే! అయినా అపుడే బావంటున్నావేమిటీ...?' అంది అక్క చిరునవ్వుతో.

'ఏం ... అనకూడదా... నిను చూడటానికి వచ్చిన ఆ అబ్బాయి... నాకు నచ్చాడు కాబట్టి మంచి మార్కులేసానని అంటున్నాను... అంతేగా... సరేలే.... నువ్వే వేయి. అమ్మానాన్నలకు కూడా అతను బాగా నచ్చినట్లున్నాడు. చూసీ చూడగానే ఇద్దరి మొహాలు పువ్వుల్లా విచ్చుకున్నాయి తెలుసా...?'

'నచ్చాడు, నచ్చలేదు అంటూ మార్కులేసేంత అర్హతా, ఆసక్తీ నాకేం లేవే... అవన్నీ అమ్మా, నాన్నా చూసుకుంటారు...నీకు నచ్చాడని చెపుతున్నావ్ గా !' అంది అక్క చిరునవ్వుతో.

ఆ మాటని అక్క నిజం చేసింది.

అతను వెళ్ళేటప్పుడు 'అమ్మా నాన్నలు వచ్చి... సాంప్రదాయం కాబట్టి... అంగీకారం తెలిపి అన్ని విషయాలూ మాట్లాడతారు. అంటే... కట్నం గురించి అనుకునేరు... కాదండోయ్... పెళ్ళి ఎపుడూ... ఎక్కడలాంటివి అన్నమాట...!' అని చెప్పాడు నాన్నగారితో.

వాళ్ళు రావటం, ముహూర్తాలు పెట్టుకోవటం అన్నీ ఆనందంగా జరిగిపోయాయి.

పెళ్ళి గురించి ఆలోచనలు చేస్తున్నపుడు అక్క, అమ్మావాళ్ళతో ఖచ్చితంగా ఒకమాట చెప్పింది.

'వాళ్ళు కట్నం వద్దన్నారని మీరు ఆర్భాటంగా పెళ్ళి చేయాలనుకుంటున్నారు. అదేం వద్దునాన్నా...! ముఖ్యమైన కొద్దిమందిని మాత్రమే పిలిచి గుళ్ళో కానిచ్చేయండి. మీరు బాగా భారీగా చేయాలని అనుకుంటే... చెల్లెలు ఉందిగా... దాని పెళ్ళి అలాచేసి ముచ్చట తీర్చుకుందాం...! ఈ మాట పెళ్ళి వాళ్ళకు కూడా చెప్పండి.'

ఈ మాట చెప్పగానే వాళ్ళూ ఆనందంగానే అంగీకరించటంతో అమ్మా నాన్నల మురిపానికి అంతులేదు. 'ఏం చెప్పినా వాళ్ళు కాదనటం లేదు. మనమ్మాయి అదృష్టవంతురాలు. అత్తవారింట్లో కూడా తన మాటే చెల్లుబాటవుతుందనిపిస్తోంది! ఇలాంటి బాధ్యత తెలిసిన అమ్మాయి కన్నవాళ్ళకే కాదు, అత్తింటివాళ్ళకూ ఆనందాన్ని పంచుతుంది!' అంది అమ్మ కళ్ళు తుడుచుకుంటూ.

నాన్నా ఆనందంగా తలవూపారు.

నేనూ ఒక మాట చెప్పాను...అమ్మ భుజంమీద తలవాల్చి 'నా పెళ్ళికేం తొందర లేదు. అక్కకి ఎలాగూ పెళ్ళయిపోతోంది కాబట్టి... నన్ను బాగా చదివించండి. మంచి ఉద్యోగం సంపాదించి... మీకు అండగా ఉంటాను!'

ఆ మాటలకు అందరూ హాయిగా సరదాగా నవ్వారు.

అనుకున్నట్లే అక్క పెళ్ళి చాలా నిరాడంబరంగా ఆనందంగా జరిగిపోయింది.

అక్క పొరుగూరికి బావతో కాపురానికి వెళ్ళే ముందు...ఇల్లు అదీ చూసుకునే వరకూ అంటూ బావ కొన్నాళ్ళు మా ఇంట్లోనే ఉన్నాడు.

ఆ రోజులు చాలా సరదాగా గడిచాయి.

ముగ్గురం సరదాగా తోటల్లోకి, సినిమాలకి షికారుగా వెళ్ళటం... కబుర్లు చెప్పుకోవటం జరిగేది. బావ రోజూ స్కూలుకి మా ఇంటినుండే వెళ్ళి వస్తూండేవాడు.

ఇల్లు తీసుకున్నాక పొరుగూరే కాబట్టి అమ్మా నాన్నా, నేను అందరం వెళ్ళి చూసి వచ్చాం. బాగా చిన్న వూరయినా చక్కగా ఉంది. ఇల్లూ అన్ని సదుపాయాలతో బావుంది. కాపురం పెట్టేటపుడు బావ అమ్మా నాన్నలకు తెలియబరిచినా వాళ్ళు 'మాకు బాగా దూరం కాబట్టి రాలేం... మీరే దగ్గరుండి అన్ని ఏర్పాట్లూ చేసేయండి' అని చెప్పారు.

అవసరమైన అన్ని సామాన్లతో అక్క కాపురం మొదలైంది.

ఏపైనా పిండివంటలూ అవీ చేసినపుడు... అమ్మ అక్కకు నన్నే వెళ్ళి ఇచ్చి రమ్మనేది. స్కూలుకు సెలవు ఉన్న ఏ ఆదివారం రోజు అయితే ఆ రోజుకి అక్కడే ఉండిపోయేదాన్ని కూడా. అలా బావతో నాకూ బాగా చనువు ఏర్పడింది.

అక్కకి అమ్మాయో, అబ్బాయో పుట్టబోతున్నారని తెలిసినపుడు ఇంట్లో పండుగ వాతావరణమే ఏర్పడింది.

ఆరోజే అమ్మ ఏవో పిండివంటలు చేసి నన్ను ఇచ్చి రమ్మంది. నేనూ చాలా ఆనందంగా వెళ్ళాను.

అక్క చాలా సరదాగా కనుపించింది. నేను ఇంట్లోకి అరుదెంచే చంటి పిల్లాడి గురించి ఏవో కబుర్లు చెబుతోంటే... అక్క నునుసిగ్గు దొంతరలమధ్య ఆహ్లాదంగా చిరునవ్వులు నవ్వుతూంది.

పచ్చని ఆకులచాటు చామంతిలా అనిపించింది అక్క.

అక్కని అలా ఆనందంగా చూసిన నా సంతోషానికి అవధేలేదు.

కానీ చాలా నాళ్ళ తర్వాత మళ్ళీ వెళ్ళిన నాకు చాలా నీరసంగా కనుపించింది. ఆదుర్దాగా అమ్మతో అంటే... ఏం కంగారుపడకుండా నిదానంగా అంది. 'పేవిళ్ళు బాగా వేధిస్తున్నాయటలే... ఫరవాలేదు నెమ్మదిగా తేరుకుంటుంది…ఇది మామూలే ' అంది.

నాన్నా, అమ్మా కూడా వెళ్ళొచ్చారు. అమ్మ అన్నమాటలతో నేనూ అవునేమో అనుకున్నాను. ఎంతైనా అమ్మది అనుభవంకదా అనుకున్నాను. అక్కను మా ఇంటికి తీసుకువచ్చారు. నాకెందుకనోగానీ అక్కని చూస్తుంటే... తనలో మునుపటి ఆనందం మచ్చుకైనా కనబడకుండా ఏదో దిగులు, మొహంలో మబ్బుతెరలా పరచుకుందనిపించింది.

అక్కని ఎందుకలా ఉంటున్నావని ఆరా తీస్తే.. 'ఏం లేదులే... ఏదో చిన్న భయం.. అంతే...!' అంటూ తేలిగ్గా నవ్వేసింది.

ప్రసవానికి భయపడుతోందని నాకు అర్థమైంది. అమ్మా, నేనూ ధైర్యం చెప్పాం. అక్కకు ప్రసవం తేలిగ్గానే అయింది.

మగపిల్లాడు పుట్టాడు. 'చూసావా... అనవసరంగా భయపడ్డావు... ఎంత ముద్దుగా ఉన్నాడో బాబు..' నేనన్న ఆ మాటలకు అక్క మబ్బుల చాటునుండి తొంగిచూసిన చందమామలా చల్లగా నవ్వింది.

బావా, అక్క అత్తా మామలు అందరూ వచ్చి చూడటం... అన్నీ మామూలుగా జరిగిపోయాయి. అక్క మాత్రం అలాగే నీరసంగా ఉంటోంది.

ఒకరోజు నాతో సరదాగా అన్నట్లుగానే చెప్పింది 'నాకేం బావుండటం లేదు... వీడి బాధ్యత అంతా నీదే. అమ్మ పెద్దదిగదా... తనని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదు...' అంది.

'ఏం మాటలక్కా...' అంటూ నేను నవ్వుతూ ఆ మాటల్ని కొట్టి పారేసాను.

'కొందరికి... స్మశాన వైరాగ్యంలా ప్రసూతి వైరాగ్యం కలుగుతుందట. నీకు ప్రసవం అయిపోయి పిల్లాడు పుట్టినా, ఇంకా ఆ వైరాగ్యం తగ్గలేదా...?' వేళాకోళంగా అన్నాను.

నా మాటలకు అక్క నీరసంగా నవ్వింది.

'అవును... తగ్గలేదు... ఆ మాట మాత్రం నిజం... అదేమిటో నాకు వైరాగ్యం ఇంకాఇంకా పెరుగుతోంది! నేను నిజంగానే చెబుతున్నాను. వీడు... నీ పిల్లాడే...! నీ చదువు పూర్తయి ఉద్యోగం, పెళ్ళి జరిగినా, పిల్లలు పుట్టినా వీడిని మాత్రం వదలకే... నీ పెద్దకొడుకులా భావించి ఆదరం చూపించు...!'

'నీకు నిజంగానే పిచ్చి పట్టింది అక్కా... లేకపోతే అప్పగింతల్లా ఏమిటా మాటలు...?' అంటూ కోప్పడ్డాను.

అక్క కళ్ళు మూసుకుంటూ నిట్టూర్చింది.

బాధపడతారని అమ్మావాళ్ళకు అక్క మాటల గురించి నేను చెప్పలేదు. అక్క ఆరోగ్యం గురించి నాన్న ఏవో టెస్టులు చేయిస్తూ, హాస్పిటల్స్ కి తిప్పుతున్నారు.

నాకు 'ఎందుకిలా జరుగుతోందీ' అన్న అయోమయమే!

ఆ రోజు... తలుచుకుంటే... ఇప్పటికీ నాకు ఒళ్ళు గగుర్పొడుస్తుంది! చాలా భయంకరమైన రోజది!

బాబు మంచంమీద హాయిగా నిద్రపోతున్నాడు. పక్కగదిలో అక్క, బావ ఉన్నారు. ఊరు నుండి వచ్చిన బావతో అక్క ఏదో మాట్లాడుతోందనుకున్నా. ఎదుకంత పెద్దగా మాట్లాడుతోందీ అనుకుంటూ అపుడే స్కూలు నుండి వచ్చిన నేను అటు వెళ్ళా. అక్క అరుస్తూన్నట్లుగా మాట్లాడుతోంటే... నేను గుమ్మం దగ్గిరే ఆగిపోయా.

బావ గుమ్మానికి చేతులు ఆనించి విలాసంగా చూస్తున్నాడు.

అక్కేమో శివంగిలా ఉంది.

'ఛీ... నీకసలు సిగ్గుందా... నీ మొహానికి నేనే ఎక్కువ! మా చెల్లెలు కూడా కావాలా... నీలాంటి నీచుడి కన్ను దానిమీద పడనివ్వను! నిన్ను నేను పెళ్ళి చేసుకున్నది ఎందుకో తెలుసా... నీ అందచందాలకు మురిసి కానే కాదు... కట్న కానుకలు వద్దన్నావంటే... మనుష్యులను మాత్రమే ప్రేమించే

మంచి మనసు నీకుందని నమ్మటం వలన! ఈ పెళ్ళిద్వారా నా తల్లిదండ్రులకు ఎంతో కొంత మేలు జరుగుతుందని నేను నమ్మాను. అవును... నా బాధ్యత తేలికగా తీరితే, వాళ్ళకి నేను చేయగల ఉపకారం ఇదే అనుకున్నాను. కానీ ... నీ నిజ స్వరూపాన్ని నువ్వు ఎంతోకాలం దాచుకోలేకపోయావు. కట్నం కోసం నన్ను వేధించటం మొదలుపెట్టావు! నా ద్వారా నా తల్లిదండ్రులనుండి రాబట్టుకోవాలనుకున్న కట్నానికి నేను సహకరించపోవటంతో మాటలతో, నీ వికృత చేష్టలతో విసిగించావు. అయినా తట్టుకున్నాను.

చివరకు... చివరకు... ఈ వేళ నీ దుర్మార్గపుటాలోచనని బయటపెట్టావు! మనిషిరూపంలో ఉన్న పశువువని నిరూపించుకున్నావు! ఇద్దర్నీ నువ్వే ఉద్ధరిస్తావా...? అంత మహానుభావుడివన్నమాట! నువ్వు బ్రతికివుంటే... మా చెల్లెలికి ఎప్పటికైనా నీ నుండి ప్రమాదం కలుగుతుంది...! అందుకే...' అంటూ ఆవేశంగా అక్క వంటగదిలోకి వెళ్ళి కత్తిపీటను తీసుకువచ్చింది.

నేను గుమ్మందగ్గిరే ఆశ్చర్యంతో అయోమయంతో శిలలా నిలబడిపోయాను. నాకాళ్ళు భూమికి అతుక్కుపోయినట్లుగా అంగుళం మేర కూడా కదల్లేకపోయినట్లుగా నిలువుగుడ్లేసుకుని చూస్తుండిపోయాను.

అక్క ఆవేశంగా కత్తిపీట ఎందుకు తెచ్చింది...? ఏం చేస్తుంది...? నాకు అర్థంకాలేదు!

అంతా క్షణంలో జరిగిపోయింది. వంటగదిలోకి వచ్చి వెళ్ళిన అక్కను చూసి అమ్మ కూడా హడావుడిగా వచ్చి నా పక్కనే అయోమయంగా నిలబడింది. అక్క ఆ కత్తిపీటతో బావపై దాడి చేసింది. చంపెయ్యాలనే కాబోలు... చేతిమీద చిన్న గాయం మాత్రం బావకు తగిలింది. ఒడుపుగా మీదకు వచ్చిన అక్కను తప్పించుకోవటమే కాకుండా, అక్కను కదలకుండా ఒకచేత్తోనే పట్టుకుని తన కంఠాన్ని బావ తెగనరికేసాడు!

అప్పుడు నాలో కదలిక వచ్చింది... 'అక్కా...' అంటూ రివ్వున పరుగెత్తి రెండు చేతులతో పట్టుకున్నాను.

అప్పటికే అక్క కళ్ళు మూతలు పడ్డాయి!

అమ్మ గొల్లున ఏడుపు మొదలు పెట్టింది.

బావ విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

ఈ ఘోరం తెలియని అక్క కొడుకు ప్రశాంతంగా అలాగే నిద్రపోతున్నాడు!

ఆ తర్వాత జరిగిన సంఘటనలను నేను వివరంగా చెప్పలేను. ఇప్పటికీ ఆ సన్నివేశం తలుచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది! ఓ పీడకలలా భయపెడుతుంది! ఎంత మరిచిపోదామన్నా అక్క మాటలు, ఆ ఆవేశం నాకు మరపుకు రావు.

బావపైన కేసు నమోదైంది. కానీ బావ మాటలు నాకు చాలా విచిత్రంగా అనిపించాయి. చాలా సామాన్యుడిలా తనదేం తప్పు లేదన్నట్లుగా నమ్మబలికాడు... కాదు... నటించాడు!

అమ్మవాళ్ళు కూడా కొంత మత్తుబడ్డారు. 'బావ కట్నం కోరుతున్నాడనే సంగతి తమకు చెప్పివుంటే... ఏదో విధంగా ఏదో ఒకటి అమ్మి ఎంతో కొంత బావకు ముట్టచెప్పేవాళ్ళం కదా' అనుకున్నారు.

ఆ మాటలకు నాకు వాళ్ళపైనా కోపం వచ్చింది.

కట్నం వద్దని ముందే ఎదుకు చెప్పడం అని నిలదీయకుండా ఏదో రకంగా ఇచ్చేవాళ్ళమని అనుకోవటం ఏమిటీ...? ఇదే నా ఆశ్చర్యం.

పైగా బావ... నన్ను తనతో పెళ్ళికి అంగీకరించమని ప్రాధేయపడటం అతనిపై అసహ్యాన్ని ఇంకా పెంచింది!

నాతో ఏం చెప్పాడో తెలుసునా అమ్మా...?

అసలు నా హుషారు, అల్లరీ, చలాకీతనం నచ్చి ముందుగా నాతోనే పెళ్ళి జరగాలని కోరుకున్నాడట! కానీ పెద్దమ్మాయికి కాకుండా చిన్నమ్మాయికి చేయరని, విధిలేని పరిస్థితుల్లో అక్కతో పెళ్ళికి అంగీకరించాడట!

'రుజువు కావాలంటే... నేను అపుడే చిన్నమ్మాయితో పెళ్ళి జరపమని మీ వాళ్ళని అడగమని మా అమ్మానాన్నలకు చెప్పానో, లేదో వాళ్ళనే అడగండీ' అని బావ అన్నాడు.

నేనంత బాగా తనకి నచ్చాననే తన మాటలకు నేను మైమరిచిపోతానని బావ అనుకోవటం నాకు అతనిపట్ల ఉన్న వైముఖ్యాన్ని ఇంకా పెంచిందే తప్ప ఏమాత్రం తగ్గించలేదు.

బావ అమ్మా నాన్నలు ఇతని వికృత మనస్తత్వాన్ని తెలుసుకునే పెళ్ళి విషయంలో ముభావంగా, అంతా అతని ఇష్టమేనన్నట్లుగా ఉండిపోయారన్న మాట!

ఈ విషయం తెలిసినప్పుడు వాళ్ళు ఒక మాట అన్నారు.

'వాడిని మేం ఎపుడో వదిలేసుకున్నాం. పేరుకి తల్లి దండ్రులమంతే గానీ అతనిపై మాకే విధమైన ప్రేమాభిమానాలూ లేవు' అని చెప్పేసారు !

ఎలాంటివాళ్ళకయినా తమ పిల్లలమీద, వాళ్ళెంతటి దుర్మార్గులైనా, ఎంతో కొంత కన్న మమకారం ఉంటుంది! కానీ... అదేం లేనట్లుగా వాళ్ళు అలా మాట్లాడటం మా అమ్మా నాన్నలకు విచిత్రంగా అనిపించింది!

దీనికి తోడు మా అమ్మా నాన్నలు నాకే నచ్చచెప్పటం నాకు ఇంకా విచిత్రంగా అనిపించింది!

'చనిపోయిన మీ అక్క ఎలాగూ తిరిగిరాదు! అతనికి శిక్ష నాకు పడేట్లు చేస్తే మనకేం లాభం...? చంటిపిల్లాడికి తండ్రి కూడా లేకుండా పోతాడు! అందుకూ.... అక్క ఆత్మహత్య చేసుకుందని కోర్టులో చెబుదాం ! అతని పాపాన అతడే పోతాడు... మనమెంత కక్ష కట్టినా ప్రయోజనం ఏం ఉంటుందీ....!' అనేసారు.

నాకు షాక్ తగిలింది!